

అదనపు ఎస్పీ విజయభాస్కర్ బదిలీ

అనకాపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్ బదిలీ అయ్యారు. అమరావతి ఇంటిలిజెన్సీ విభాగానికి అదనపు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయ భాస్కర్ 2022లో జిల్లాకు అదనపు ఎస్పీ (పరిపాలన)గా బదిలీపై వచ్చారు. రెండేళ్లపాటు జిల్లాలో ఆయన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఎఎస్పీగా అదనపు బాధ్యతలు నిర్వహించారు.



విజయభాస్కర్

క్వారీలపై కన్ను!

మూతపడిన వాటిని తెరిపించేందుకు మైనింగ్ మాఫియా ప్రయత్నాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కోట్లు కురిపించే కొండలను పిండి చేసేందుకు మైనింగ్ మాఫియా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో వైసీపీ నేతలతో అంటకాగిన మైనింగ్ మాఫియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించింది. గతంలో జరిమానా చెల్లించని కారణంగా మూతపడిన పలు నల్లరాయి క్వారీలను మళ్లీ తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందుకు కూటమి నేతల్లో ముఖ్యులతో చర్చలు జరుపుతోంది.

- మొన్నటి వరకు వైసీపీ నేతలతో అంటకాగిన క్వారీ నిర్వాహకులు
- కూటమి రావడంతో ప్లేటు ఫిరాయింపు
- కూటమి నేతలతో చర్చలు
- రూ.120 కోట్లు జరిమానా చెల్లించకుండా క్వారీలు సొంతం చేసుకునేందుకు యత్నాలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మైనింగ్ అక్రమాలపై అప్పట్లో అందిన ఫిర్యాదులపై స్పందించిన గనుల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి 2017-18 మధ్యకాలంలో నల్లరాయి క్వారీల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి, అనుమతులు లేకుండా నడుపుతున్న 13 క్వారీలను గుర్తించి రూ.120 కోట్లకు పైగా జరిమానా విధించారు. ఒక్కొక్క క్వారీ నిర్వాహకుడికి రూ.10 నుంచి రూ.20 కోట్లు వరకు జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అనకాపల్లి మండలం మార్టూరు, కుంచంగి రెవెన్యూ పరిధిలో అనధికార క్వారీల నిర్వాహకులు జరిమానా చెల్లించకుండా మూసేశారు.

మళ్లీ తెరిపించేందుకు యత్నాలు

జిల్లాలో మూతపడిన పలు నల్లరాయి క్వారీలను తిరిగి తెరిపించేందుకు మైనింగ్ మాఫియా రంగంలోకి దిగింది. ప్రధానంగా అనకాపల్లి మండలంలో మార్టూరు, మామిడిపాలెం, బవులువాడ, కూండ్రం, కుంచంగి, జంగాలపాలెం, మాకవరం, సంతపాలెంలలో నల్లరాయి కొండలున్నాయి. వీటిని మైనింగ్ చేసుకొనేందుకు గనుల శాఖ లీజుకు ఇస్తుంది. నల్లరాయి మెటల్, చిప్స్, శ్లాబ్ మెటల్, రోడ్డు మెటల్ వంటి వాటిని మైనింగ్ చేస్తారు. కానీ గనుల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధించిన జరిమానా చెల్లించకపోవడంతో మార్టూరు, కుంచంగి పరిసరాల్లో పలు క్వారీలు అప్పట్లో మూతపడ్డాయి. అయితే ఈ జరిమానాను మైనింగ్ మాఫియా ప్రభుత్వానికి చెల్లించలేదు. అదే సమయంలో 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



కుంచంగిలో మూతపడిన నల్లరాయి క్వారీ

అప్పుడు వైసీపీ నేతలతో కుమ్మక్కు

2109లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గనుల శాఖాధికారులు జరిమానా వసూళ్ల విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు. మైనింగ్ మాఫియాను అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు నల్లరాయి క్వారీల ద్వారా దండుకొనే పనిలో పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మైనింగ్ మాఫియా కనుసన్నల్లోనే నల్లరాయి క్వారీల్లో తవ్వకాలు జరిగాయి. క్వారీల నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామస్థులను నయానో భయానో లొంగదీసుకొని పర్యావరణ అనుమతులు పొందారు. తర్వాత జరిమానా చెల్లించకుండా మూసివేసిన నల్లరాయి క్వారీలను ... మిగతా 6వ పేజీలో

క్వారీలతో అనర్థాలెన్నో...?

జిల్లాలో అనుమతి లేని క్వారీల కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తరచూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకొనేవారే కరువయ్యారు. గ్రామాలు, జనావాసాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి మైనింగ్‌కు అనుమతి ఇవ్వరాదని 2003 డిసెంబరు 12న సుప్రీంకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. గ్రామాల్లో నల్లరాయి క్వారీలున్న ప్రదేశాల్లో ఎటువంటి అనుమతులు పొందకుండానే నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. సమీపంలో గృహాల గోడలు బీటలు వారుతున్నాయి. పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అనధికార బ్లాస్టింగ్స్ కారణంగా ఇళ్లపై రాళ్లు ఎగిరి పడుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. వాయు, నీటి కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మార్టూరు, రొంగలివానిపాలెం, కుంచంగి, మామిడిపాలెం వంటి ప్రాంతాల్లో క్వారీల నుంచి ఎగిరే దుమ్ము, ధూళికి అనేకమంది ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారు. గ్రామస్థులను నయానో భయానో లొంగదీసుకొని పర్యావరణ అనుమతులు మాఫియాకు కట్టబెట్టేందుకు అధికారులు సైతం ప్రయత్నాలు చేసి, పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందజేస్తున్నారు. ఇప్పటికైనా అనుమతి లేని అనధికార క్వారీల నిర్వాహకుల ఆగడాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రొంగలివానిపాలెంలో మళ్లీ తెరిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న మూతపడిన నల్లరాయి క్వారీ



విలేకరులతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

బొత్స ఏకగ్రీవ ఎన్నిక

- కోడ్ ఎత్తివేతకు ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు

విశాఖపట్నం/మహరాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల ప్రక్రియ ముగిసింది. పోటీలో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే ఉండడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శుక్రవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం తన ఛాంబర్‌లో బొత్సకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. బొత్స సత్యనారాయణ 2027 డిసెంబరు ఒకటో తేదీ వరకూ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల సంఘానికి రిటర్నింగ్ అధికారి నివేదిక పంపారు. ఒకటి, రెండు రోజుల్లో కోడ్ ఎత్తివేతకు సంబంధించి ఆదేశాలు వెలువడనున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన తరువాత యథావిధిగా అభివృద్ధి/సంక్షేమ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకోనున్నారు. ఇంకా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చేందుకు మార్గం సుగమం కానున్నది.

అభివృద్ధిలో మా వంతు పాత్ర పోషిస్తాం : ఎమ్మెల్సీ బొత్స

శ్రావణ శుక్రవారం వంటి పవిత్రమైన రోజున ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీగా ధ్రువీకరణపత్రం అందుకున్న తరువాత విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. బొత్స వెంట రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

అత్యవసర సేవలు, శస్త్రచికిత్సలు మినహా మిగిలినవన్నీ నిలిపివేస్తున్నట్టు వైద్య సంఘాల ప్రకటన

- కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసన
- సంఘీభావాన్ని ప్రకటించిన ఇతర అసోసియేషన్లు, వైద్య, అనుబంధ సంఘాల ప్రతినిధులు
- విద్యార్థి, ప్రజా సంఘాల మద్దతు
- రిలే దీక్షలు, ర్యాలీల నిర్వహణ
- కేజీహెచ్ సహా ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



విశాఖపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్య సేవల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఉదయం ఆరు నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు వైద్య సేవలను నిలిచిపోనున్నాయి. అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన ఓపీ, ఐపీ, స్కానింగ్, రక్త, ఇతర పరీక్షలను 24 గంటలపాటు ఆపివేయనున్నారు. ప్రభుత్వ వైద్యుల సంఘం, ఏపీ రేడియాలజిస్ట్ అసోసియేషన్, ఏపీ ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, ఏపీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్, జూనియర్ వైద్యుల సంఘం, పలు విద్యార్థి, ప్రజా సంఘాలు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేటు హాస్పిటల్స్ నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్‌లో కూడా 24 గంటలపాటు సేవలను నిలిపివేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు, శస్త్రచికిత్సలను మాత్రం నిర్వహిస్తామని ఐఎంఏ ప్రకటించింది.

నిరసన కార్యక్రమాలు

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్షలు నిర్వహిస్తారు. ఉదయం మానవహారం, ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం ఎదుటగల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. వైద్య విద్యార్థినికి జరిగిన అన్యాయంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జూనియర్ వైద్యుల సంఘం సలహాదారు జహంగీర్ పేర్కొన్నారు. కోల్‌కతాలో మృతిచెందిన వైద్య విద్యార్థినికి న్యాయం జరిగేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. నిందితులను తక్షణమే ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రభుత్వ ఆస్పత్రులు

జూనియర్ వైద్యులతోపాటు ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా బంద్‌కు మద్దతు తెలిపిన నేపథ్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని కేజీహెచ్, ఘోషా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, మానసిక వైద్యశాల, విమ్స్‌లో రోగులు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీహెచ్‌లో క్యాజువాల్టీ సేవలు అందించేందుకు 16 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 26 మంది ప్రీ పారామెడికల్ డాక్టర్లు, ఓపీ విభాగాలు నిర్వహించేందుకు అనుగుణంగా ఆయా విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఏర్పాటుచేశారు. అత్యవసర శస్త్రచికిత్సల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా 28 మంది అనస్థీషియన్‌లను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెలవులు రద్దు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. విమ్స్‌లో కూడా మొత్తం 30 మంది వైద్య నిపుణుల బృందాన్ని అందుబాటులో ఉంచినట్టు డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు.



అనకాపల్లి గవరపాలెం సతకంపట్టులోని కనక దుర్గమ్మను శ్రావణ శుక్రవారం సందర్భంగా మోక్ష లక్ష్మిగా అలంకరించారు. ఆలయ అర్చకులు భోగాపురపు వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.
- అనకాపల్లి టౌన్

విద్యార్థుల అగచాట్లు

అద్దె ఇంట్లో ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల

- వసతి చాలక విద్యార్థుల ఇబ్బందులు
- 5 నుంచి 10 తరగతి వరకు 280 మంది..
- గదులు లేక తరగతికి ఒక సెక్షన్‌తో సరిపెడుతున్న అధికారులు
- నెలకు అద్దె రూ.90,306
- క్రీడా మైదానం లేక ప్రైవేటు స్థలాల్లో ఆటలు



నర్సీపట్నంలో ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్న అద్దె భవనం

నర్సీపట్నం, ఆగస్టు 16: **మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ గురుకుల పాఠశాల (బాలురు)కు సొంత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. తరగతి గదులు, వసతి సరిపోకపోవడంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. గదులు లేకపోవడంతో సెక్షన్లు పెట్టలేకపోతున్నారు. ఫలితంగా ఐదు నుంచి పది తరగతులకు ఆరు సెక్షన్లు మాత్రమే నిర్వహిస్తున్నారు. దీంతో అడ్మిషన్లు పెంచడానికి అవకాశం లేక బీసీ విద్యార్థులు గురుకుల విద్యకు దూరమవుతున్నారు.**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో రాష్ట్ర వ్యాప్తంగా 65 మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ గురుకుల పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట, పెందుర్తి (గోపాలపట్నం) నియోజకవర్గాలకు ఐదు బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేసింది. అప్పట్లో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గానికి మంజూరైన గురుకుల పాఠశాలను మాకవరపాలెం మండలంలో పెడదామని భావించారు. అక్కడ ప్రభుత్వ భవనం లేకపోవడంతో పెదబొడ్డేపల్లిలోని నర్సీపట్నం పురపాలక సంఘం భవనంలో ఒక సంవత్సరం అగ్రిమెంట్‌తో మహాత్మా జ్యోతిరావు పూలే ఏపీ బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. 2019 ఫిబ్రవరి 4న పాఠశాల ప్రారంభించారు. ఐదు నుంచి 8 తరగతుల వరకు 160 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. మునిసిపాలిటీకి నెలకు అద్దె రూపేనా రూ.26 వేలు చెల్లించేవారు. ఒక సంవత్సరం అగ్రిమెంట్ తర్వాత భవనం అప్పగించాలని కమిషనర్ నోటీసు ఇవ్వడంతో గురుకుల పాఠశాలను బలిఘట్టం బైపాస్ రోడ్డులోని ఒక ప్రైవేటు భవనంలోకి మార్చాల్సి వచ్చింది. 2021 ఆగస్టు 1న మునిసిపాలిటీ భవనంలోంచి ప్రైవేటు భవనంలోకి గురుకుల పాఠశాలను మార్చారు. ప్రైవేటు భవనంలో 32 గదులు ఉన్నాయి. హాస్టల్ కోసం 12, క్లాసుల కోసం 8 గదులు కేటాయించారు. ప్రిన్సిపాల్ ఆఫీసు రూమ్, స్టాఫ్ రూమ్, స్టాక్ రూమ్ తదితర అవసరాల కోసం మిగిలిన గదులు వినియోగిస్తున్నారు. దీంతో పాఠశాలలోని 280 మంది విద్యార్థులకు తరగతి గదులు, విశ్రాంతి గదులు సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు అద్దె భవనానికి నెలకు అద్దె ... మిగతా 6వ పేజీలో

నేడు పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు


(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో 1,476 పాఠశాలల్లో కమిటీల నియామకాలు
- ఉదయం 8 గంటల నుంచి ఎన్నికలు ప్రారంభం

పాఠశాలల్లో విద్యాకమిటీల స్థానంలో ఏర్పాటు చేసిన యాజమాన్య కమిటీల (స్కూల్ మేనేజ్‌మెంట్) ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 1,476 పాఠశాల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ఎంఈవోలకు జిల్లా విద్యాశాఖాధికారులు జారీ చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికల నిర్వహణ కోసం ఈనెల 8న జిల్లా విద్యాశాఖాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రతి పాఠశాలలో కమిటీలో హెచ్‌ఎంతోపాటు ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఒక కోఆప్షన్ సభ్యుడు, మరో 14 మంది సభ్యులతో కలిపి 18 మంది ఉంటారు. పాఠశాల యాజమాన్య కమిటీలో సభ్యులుగా ఉండాలంటే వారి పిల్లలు తప్పనిసరిగా అదే పాఠశాలలో విద్యార్థి అయి ఉండాలి. అంతేకుండా అదే గ్రామంలో నివసిస్తున్న వ్యక్తి అయి ఉండాలనే నిబంధన పెట్టారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రధానోపాధ్యాయులు సమావేశాలు నిర్వహించనున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిటీలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించనున్నాయి.

19న తాండవ నీరు విడుదల

నాతవరం ఆగస్టు 16 : తాండవ నీటిని ఈనెల 19వ తేదీన విడుదల చేస్తున్నట్టు తాండవ రిజర్వాయర్ డీఈఈ అనురాధ తెలిపారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం 19న ఉదయం 8.45 గంటలకు తాండవ నీరు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 376.2 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయని ఆమె తెలిపారు. తాండవ ఆయకట్టు కింద 52 వేల ఎకరాల భూమి సాగవుతుందని తెలిపారు. కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేస్తున్నామని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని కోరారు. అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన రైతులు వరి సాగుకు తాండవ నీటిని ఉపయోగించుకోవాలన్నారు. అలాగే కాలువలతోపాటు కొంతనీటిని తాండవ నదికి కూడా విడుదల చేస్తామని, ఈ నీటిని నిమ్మకట్టు చానల్ రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.



తాండవ రిజర్వాయర్

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య

- చీరకు పసిపాపను కట్టుకొని అఘాయిత్యం
- రెండు రోజుల తర్వాత పొదల్లో నుంచి ఏడ్చుకుంటూ పాప రావడంతో బయటపడిన ఘటన
- క్లూస్ టీమ్ పరిశీలన
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐ

అరకులోయ, ఆగస్టు 16: మండలంలోని పానిరంగణి గ్రామం రహదారి పక్కన పొదల్లో వివాహిత ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తన రెండేళ్ల కుమార్తెను చీరకు కట్టుకొని అఘాయిత్యానికి పాల్పడింది. రెండు రోజులు తర్వాత పాప ఏడ్చుకుంటూ బయటకు రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

అరకులోయకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పానిరంగిణి గ్రామం ప్రధాన రహదారి పక్కనే పొదల్లో వివాహిత ఉరివేసుకుని మృతి చెందింది. పద్మాపురం గ్రామానికి చెందిన పాంగి పద్మ(26) బుధవారం ఉదయం పద్మాపురం నుంచి రెండేళ్ల కుమార్తెతో కలిసి పానిరంగిణిలోని సోదరి ఇంటికి వచ్చింది. చాలా రోజుల తర్వాత రావడంతో సోదరి అన్ని మర్యాదలు చేసింది. తర్వాత వారు కూలి పనులకు అరకులోయకు వచ్చేశారు. సాయంత్రం ఇంటికి తిరిగి ఇంటికి వెళ్లేటప్పటికి పద్మ కనిపించకపోవడంతో పద్మాపురం వెళ్లిపోయిందని భావించారు. అయితే పద్మ తన రెండేళ్ల పాపను చీరకు కట్టుకొని పానిరంగిణి గ్రామం ప్రధాన రహదారి పక్కనే పొదల్లో చిన్న చెట్టుకొమ్మకు ఉరివేసుకుంది. అయితే ఆ పాప పొదల్లో నుంచి శుక్రవారం ఉదయం ఏడ్చుకుంటూ బయటకు రావడంతో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్ల వారు సపర్యలు చేశారు. పాపకు వంటినిండా దోమలు కుట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో పాపను ఎత్తుకుంటూ పొదల్లోకి వెళ్లి పరిశీలించగా పద్మ ఉరివేసుకొని మృతి చెంది ఉండడం కనిపించింది. చుట్టరికానికి వచ్చిన పద్మను వారు గుర్తించారు. దీంతో ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. అలాగే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్ సిబ్బందితో చేరుకొని విచారణ జరిపారు. ఈ సంఘటనపై పద్మ బంధువులు మాత్రం ఆత్మహత్య కాదు.. తన భర్తే చంపేసి ఉంటాడంటూ ఆరోపించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. అనంతరం శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని అరకు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా సీఐ రుద్రశేఖర్ విలేకర్లతో మాట్లాడుతూ.. మృతురాలికి తాగుడు వ్యసనం ఉందని, మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తమ ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. సంఘటనా స్థలంలో ఉన్న సీన్‌ను బట్టి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టే ఉందన్నారు. శవపరీక్షలో వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. పద్మ భర్త కొండను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు.

రెండు రోజులు తల్లి చంకనే చిన్నారి

పద్మ బుధవారం సాయంత్రం మృతి చెంది ఉంటుంది. తన కుమార్తెను చీర పైటకు కట్టుకొని పాలు పెడుతూనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టుంది. తను ఏ సమయంలో ప్రాణం విడిచిందో తెలియదు గాని చెట్ల పొదలో దోమలు నడుమ పసిపాప నరకయాతన అనుభవించింది. పాప శరీరం అంతా దోమకాట్లతో నిండి వాచిపోయింది. చీరకట్టు నుంచి ఏ విధంగా బయటపడిందో తెలియదుగాని చంటి బిడ్డ బయటకు రావడంతోనే ఈ ఘటన వెలుగుచూసింది. రెండ్రోజులుపాటు పసిపాప మృతి చెందిన తల్లి చంకన ఏ విధంగా ఉందో ఆ భగవంతునికే ఎరుక అంటూ పలువురు వ్యాఖ్యానించారు. పసి పాప మృత్యుంజయురాలు అని పలువురు పేర్కొన్నారు.

30 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

ముంచంగిపుట్టు, ఆగస్టు 16: ఒక ఇంటిలో నిల్వ ఉంచిన గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ కె.రవీంద్ర అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బాబుసాల పంచాయతీ జడిగూడ గ్రామంలో ఓ ఇంటిలో గంజాయితరలించేందుకు సిద్ధంగా ఉంచినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం పోలీసులు వెళ్లగా, వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన కొర్రా అస్సును పట్టుకున్నారు. అతని వద్ద రెండు బస్తాల్లో ఉన్న సుమారు 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కె.లక్ష్మయ్య, సిబ్బంది కె.రామారాజు, కె.వెంకటరావు, కె.మోహన్‌దాసు, వీఆర్‌వోలు భాస్కర్, పద్మారావు పాల్గొన్నారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16: కంపెనీకి డబ్బులు చెల్లించకుండా తన సొంతానికి వాడుకుని వినియోగదారులు చెల్లించలేదని చెబుతూ మోసం చేశాడనే సంఘటనపై ఒక వ్యక్తిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ జి. శంకరరావు తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లో పనిచేస్తున్న ఎస్‌బీఐ కాలనీకి చెందిన సిహెచ్.లక్ష్మణ్ ఏడు ఫోన్లు, ఒక పర్సు వినియోగదారులకు విక్రయించి, వారి నుంచి తీసుకున్న రూ.98,332 కంపెనీకి చెల్లించలేదని గుంటూరుకు చెందిన షేక్ హుస్సేన్ ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూలై వరకు వీటి అమ్మకాలు చేసి కంపెనీ నుంచి ఎప్పుడు సమాచారం అడిగినా వినియోగదారుల ఆచూకీ తెలియడం లేదని చెబుతూ వస్తున్నాడని ఫిర్యాది హుస్సేన్ పేర్కొన్నారన్నారు. కంపెనీకి డబ్బులు చెల్లించకుండా సొంతానికి వాడుకుని మోసం చేసిన లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరి పట్టివేత

కశింకోట, ఆగస్టు 16: మండలంలోని నర్సింగబిల్లి రైల్వే గేటు మీదుగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తమకు వచ్చిన సమాచారం మేరకు నర్సింగబిల్లి రైల్వే గేటు వద్ద తనిఖీలు నిర్వహించగా మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన పెంటకోట గణేష్ మద్యంతో పట్టుబడ్డాడన్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా 45 క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు తేలిందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని గణేష్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

పుస్తెల తాడు అపహరణ

కొత్తూరు, ఆగస్టు 16: వృద్ధురాలి మెడలో నుంచి నాలుగున్నర తులాల పుస్తెల తాడు అపహరించుకుపోయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు శుక్రవారం తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం సంపతిపురం పంచాయతీ చినసంపతిపురం గ్రామానికి చెందిన నక్కా నూకరత్నం తన నివాసానికి సమీప బంధువుల ఇంట్లో వివాహ కార్యక్రమానికి గురువారం రాత్రి వెళ్లారు. తిరిగి నివాసానికి వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో ఉన్న పుస్తెల తాడును తెంపుకొని పారిపోయారు. వీటి విలువ రూ.54 వేలు ఉంటుందని అంచనా వేశారు. ఈ సంఘటనపై వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు

జిల్లా టూరిజం కౌన్సిల్ ఏర్పాటు

అనకాపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా టూరిజం కౌన్సిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఏడుగురు అధికారులు కాగా, ఐదుగురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు. జిల్లా పర్యాటక శాఖాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ఎస్పీ, జీవీఎంసీ జోనల్ కమిషనర్, జిల్లా అటవీ శాఖాధికారి, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరక్టర్(విశాఖపట్నం), జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, జిల్లా విద్యా శాఖాధికారి, ఆర్కియాలజీ కన్జర్వేషన్ అసిస్టెంట్(విశాఖపట్నం), పద్మశ్రీ అవార్డు అందుకున్న ఏటికొప్పాక గ్రామ ప్రతినిధి, కళ్యాణి ఆర్ట్స్ అకాడమీ కరస్పాండెంట్, గాంధీ నగర్ యోగా శిక్షకులు, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షులు విజయమోహన్, హోటలియర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పవన్ కార్తీక్ ఇందులో సభ్యులు. వీరంతా కలిసి పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపడతారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

చెత్త కదలదు.. కంపు వదలదు!

డంపింగ్‌యార్డు తరలింపునకు కలగని మోక్షం

- 12 ఏళ్లుగా జీవీఎంసీ కార్యాలయ ఆవరణలోనే..!
- భరించలేని దుర్వాసనతో పట్టణ ప్రజల అవస్థలు





జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో చెత్త కుప్పలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16: జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణ నడిబొడ్డున జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉన్న డంపింగ్ యార్డు తరలింపునకు మోక్షం లభించడం లేదు. సుమారు 12 ఏళ్లుగా జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలోనే యార్డు కొనసాగుతోంది. భరించలేని దుర్వాసన వెదజల్లడంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీని తరలింపునకు ప్రజా సంఘాలు ఎన్ని ఉద్యమాలు చేసినా ఫలితం లేకపోతోంది.

పట్టణంలోని శారదానగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని అక్కడి నివాసస్థులు గతంలో ఆందోళన చేపట్టారు. పట్టణంలో ఉత్పత్తయిన చెత్తను శారదానగర్‌లోని జీవీఎంసీ స్థలంలో ఉన్న యార్డుకు తరలించకుండా చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో డంపింగ్‌యార్డు ఏర్పాట్లకు అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ ఆయా ప్రాంతాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో మరో మార్గం లేక పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తనంతటినీ జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో వేసి విశాఖకు తరలిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్ అనేకసార్లు ఆందోళన చేపట్టినా ప్రయోజనం లేకపోయింది.

గత ఐదేళ్లూ చర్యలు శూన్యం

వైసీపీ ప్రభుత్వం పట్టణ నడిబొడ్డు నుంచి దూర ప్రాంతాలకు యార్డును తరలించే విషయంలో గత ఐదేళ్లూ ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. కనీసం ఈ ప్రాంతవాసుల మొర వినిపించుకోలేదు. ఈ కంపోస్టు యార్డుకు ఆనుకుని అనేక నివాస గృహాలు, జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు, ఎండలు కాసినప్పుడు దుర్వాసనలతో వీరంతా అవస్థలు పడుతూ వస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో, తరువాత కూటమి నాయకులు ఈ యార్డును పరిశీలించి పట్టణ ప్రజలకు అనారోగ్యంగా మారిన డంపింగ్‌యార్డును పట్టణానికి దూరంగా తరలించాలని నిర్ణయించారు. గత నెలలో పోలవరం కాలువ పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ డంపింగ్ యార్డు సమస్యను కూటమి నాయకులు తీసుకువెళ్లారు. అంతేకాకుండా ఇటీవల అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో కూడా స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు డంపింగ్‌యార్డు విషయాన్ని సమీక్షలో ప్రస్తావించి పట్టణానికి దూరంగా తరలించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించినట్టు తెలిసింది. దీంతో జీవీఎంసీ జోనల్ కమిషనర్‌తో కలెక్టర్ చర్చించారు.

ఇదే సమయంలో విశాఖ ఉమ్మడిజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ రావడంతో డంపింగ్‌యార్డును తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జాప్యం చోటు చేసుకుంటూ వచ్చింది. ఈ డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏ ప్రాంతానికి తరలించాలనే ఆలోచనలో ప్రజా ప్రతినిధులతో సమీక్ష చేసి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. అయితే శుక్రవారం సాయంత్రంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో ఎంత వేగంగా యార్డు తరలింపుపై కదలిక వస్తుందోనని ఈ ప్రాంత వాసులు ఎదురు చూస్తున్నారు. యార్డును తరలించే పనిలో భాగంగా పట్టణానికి దూరంగా డంపింగ్‌యార్డుగా కాకుండా స్టాక్ పాయింట్‌గా పెట్టి అనకాపల్లిలో ఉత్పత్తి అయ్యే చెత్తను నిర్ధారించుకున్న ప్రదేశానికి తరలించి అక్కడి నుంచి భారీ వాహనాల పై చెత్తను విశాఖ కాపులుప్పాడలోని ప్రధాన డంపింగ్‌యార్డుకు తరలించే విధంగా అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో రోజుకు 80 నుంచి 90 టన్నులు వరకు చెత్త ఉత్పత్తి అవుతుందని శానిటేషన్ విభాగం అధికారులు చెబుతున్నారు. అయితే అనకాపల్లి నుంచి చెత్తను పూర్తి స్థాయిలో తొలగించకపోవడం వల్ల ఎప్పటికప్పుడు జోనల్ కార్యాలయం ఆవరణలో చెత్తకుప్ప దర్శనమిస్తున్నది. అయితే అధికారులు ఈ డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఎంత త్వరగా తరలించి తమ సమస్యలు పరిష్కరిస్తారోనని ఈ ప్రాంత వాసులు ఎదురు చూస్తున్నారు. అధికారులు కూడా తమ సమస్యలను దృష్టిలో పెట్టుకుని యార్డును వేగంగా తరలించాలని వారు కోరుతున్నారు.

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ ఎం.దీపిక



పోలీసులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ

పాయకరావుపేట, ఆగస్టు 16: గంజాయి రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎం.దీపక ఆదేశించారు. శుక్రవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. తరచూ నమోదువుతున్న నేరాల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి కేసుల పురోగతిని తెలుసుకుని తగిన సూచనలు ఇచ్చారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పోలీసులతో ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాడంతో పాటు నేషనల్ హైవేలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజు, ఎస్ఐ బి.జోగారావు, ఏఎస్ఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీఆర్ హబ్‌పై విచారణ

ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆదేశాలు

డీన్ ప్రొఫెసర్ మల్లిఖార్జునరావు నేతృత్వంలో కమిటీ

పీహెచ్‌డీ ప్రవేశాలు,గైడ్లుగా నియమితులైన వారి అర్హత పరిశోధన సాగిన తీరు వంటి అంశాలు పరిశీలన

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో గల ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్ (టీడీఆర్) వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు విచారణకు ఆదేశించారు. గడిచిన ఐదేళ్లలో టీడీఆర్ హబ్‌లో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అనర్హులైన వారికి అడ్డగోలుగా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారన్నది ప్రధానమైన ఆరోపణ. దానిపై వీసీ దృష్టిసారించారు. టీడీఆర్ హబ్‌లో జరిగిన వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా ఆదేశించారు. ఇందుకు ప్రత్యేకంగా కమిటీని నియమించారు. టీడీఆర్ హబ్ డీన్‌గా ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌ను తొలగించి ఆ స్థానంలో ప్రొఫెసర్ మల్లిఖార్జునరావుకు బాధ్యతలు అప్పగించారు. ఆ కమిటీకి కూడా ఆయన నేతృత్వం వహిస్తారు. ఆయనతోపాటు శ్రీకాకుళం జిల్లా అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, విజయనగరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఏయూ వాతావరణ, సముద్ర అధ్యయన విభాగాధిపతి ప్రొఫెసర్ సునీత, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ గోపీచంద్ నాయక్ సభ్యులుగా ఉంటారు. గడిచిన కొన్నాళ్లుగా టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో జరిగిన పీహెచ్‌డీ ప్రవేశాలు, అనుసరించిన నిబంధనలను కమిటీ పరిశీలించనున్నది. అలాగే, సుమారు 400 మందికి గైడ్లుగా అవకాశం కల్పించారు. వీరిలో ఏయూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఉన్నారు. అయితే, చాలామందికి అర్హతలు లేకపోయినప్పటికీ అవకాశం కల్పించారన్నది ఆరోపణ. గైడ్లుగా అవకాశం పొందేందుకు ఉన్న అర్హతలు వంటి అంశాలను పరిశీలించనున్నారు. ప్రస్తుతం 600 మంది పరిశోధకులు ఉన్నారు. వీరిలో కొందరు ఆర్‌సెట్ ద్వారా, మరికొందరు ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాలు పొందారు.ప్రవేశాలకు సంబంధించి అనుసరించిన నిబంధనలను కూడా పరిశీలించి నివేదిక అందించనున్నారు. టీడీఆర్ హబ్‌లోని గైడ్లు వ్యవహారంపై ప్రస్తుతం విచారణ సాగుతుండడంతో 2024-25 ఏడాదికి సంబంధించి పీహెచ్‌డీ ప్రవేశాలను వర్సిటీ ఉన్నతాధికారులు నిలిపి వేశారు. ఆర్‌సెట్ కన్వీనర్ టీడీఆర్ హబ్‌కు 172 పీహెచ్‌డీ సీట్లను కేటాయిస్తామని చెప్పినప్పటికీ..విచారణ పూర్త య్యేంత వరకు వద్దని చెప్పినట్టు వీసీ ప్రొఫెసర్ జి.శశి భూషణరావు వెల్లడించారు. ఈ వ్యవహారంపై నివేదిక వచ్చిన తరువాత అడ్మిషన్లు తీసుకుంటామన్నారు.

వ్యవసాయ పరపతి సంఘం.. నిర్వీర్యం!

- కొయ్యూరు పీఏసీఎస్‌లో పడిపోయిన లావాదేవీలు
- రాజకీయ ఒత్తిళ్లతో ఐదేళ్లుగా వసూలుకాని రుణాలు
- రూ.1.5 కోట్లకు పేరుకుపోయిన మొండి బకాయిలు



కొయ్యూరు పీఏసీఎస్ భవనం ఇదే..

కొయ్యూరు, ఆగస్టు 16: కొయ్యూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నిర్వీర్యమవుతోంది. వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా టర్నోవర్ పడిపోయింది. దీనికితోడు మొండి బకాయిలు పేరుకుపోయాయి.

కొయ్యూరులో సుమారు మూడు దశాబ్దాల క్రితం స్థాపించిన పీఏసీఎస్ రెండు దశాబ్దాల పాటు ఒక వెలుగు వెలిగింది. ఆరంభంలో రూ.10 చెల్లించి సుమారు ఎనిమిది వేలకు పైబడి రైతులు సభ్యులుగా చేరారు. 2019 వరకు ఈ సభ్యులే సంఘం నుంచి తక్కువ వడ్డీతో వ్యవసాయ రుణాలు పొంది పెట్టుబడులకు వినియోగించుకునేవారు. వ్యవసాయ సీజన్‌లో ఆర్థిక ఇబ్బందులను కొంత మేర అధిగమించి ధైర్యంగా ముందుకు సాగేవారు. అప్పటిలోనే వ్యవసాయ యాంత్రీకరణ చర్యల్లో భాగంగా సంఘ రైతులకు సీజన్‌లో దుక్కి, దమ్ము, విత్తనాలు జల్లుకోవటానికి, ఇతర వ్యవసాయ పనులకు అవసరమైన రూ.9 లక్షలు ఖర్చుతో ట్రాక్టర్‌ను అప్పటి ప్రభుత్వం సమకూర్చింది. ఈ ట్రాక్టర్‌ను అతి తక్కువ అద్దెతో వినియోగించుకుని వ్యవసాయ పనులు సకాలంలో నిర్వహించుకునే అవకాశం కల్పించింది. వచ్చిన అద్దె డబ్బులతో ట్రాక్టర్ మరమ్మతులు తదితర పనులు నిర్వహించుకునేవారు. దీని మరమ్మతులు తదితర పనులకు పీఏసీఎస్ నిధుల నుంచి వెచ్చించే అవకాశం లేకుండా నిర్వహణ బాధ్యత సంఘ ఛైర్మన్లు చూసుకునేవారు. ప్రస్తుతం సంఘానికి ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం జరగడం, తరచూ ఈ సంఘాలకు అధికారం చేపట్టిన ప్రభుత్వాలు నామినేటెడ్ పద్ధతిలో ఛైర్‌పర్సన్‌లను నియమించడంతో ట్రాక్టర్ అద్దె వచ్చినా ఛైర్‌పర్సన్‌లు ఎవరికి అందినంత వారు దోచుకోవడమే కాకుండా సొంత అవసరాలకు వినియోగించుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ట్రాక్టర్ మరమ్మతులకు నోచుకోక మూలకు చేరింది.



ఆరేళ్లుగా మూలకు చేరిన ట్రాక్టర్

అమాంతంగా తగ్గిన సభ్యులు

ఎనిమిది వేలకు పైబడి సభ్యులు ఉండే కొయ్యూరు పీఏసీఎస్‌లో ప్రస్తుతం 3,500కు తగ్గిపోయారు. దీనికితోడు గత ప్రభుత్వ హయాంలో సభ్యత్వం కోసం రూ.10 నుంచి అమాంతంగా రూ.300 పెంచడంతో సభ్యుల సంఖ్య అమాంతంగా దిగజారింది. అలాగే రూ.3.70 కోట్ల టర్నోవర్ ఉండే ఈ సంఘం రూ.1.5 కోట్లకు చేరింది. బకాయిల వసూలు కాకపోవడంతో టర్నోవర్ పడిపోయి ఉన్న సభ్యులకు వ్యవసాయ సీజన్‌లో కనీస పెట్టుబడులకు సైతం రుణాలు అందించలేని దుస్థితికి చేరింది. మొత్తానికి పీఏసీఎస్‌లో సిబ్బందికి జీతాలు లేకుండా, రైతులకు వ్యవసాయ సీజన్ వచ్చినా ఆర్థిక సహకారం అందించలేక నిర్వీర్యమయ్యే దుస్థితి దాపురించింది.

హోం మంత్రి నివాసంలో వరలక్ష్మీ వ్రతం



నివాసంలో వరలక్ష్మీ వ్రతం పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 16: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి తన నివాసంలో శుక్రవారం ఉదయం శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీదేవి వ్రతం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు శ్రీసూక్త విధానంలో అమ్మవారి పూజలు, కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి అనంతరం ధూపదీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. హోం మంత్రి అనిత కుటుంబసభ్యుల గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం పలువుర ముత్తయిదువులకు హోం మంత్రి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని, ప్రజలంతా ఆర్థిక ఇబ్బందులు లేకుండా అమ్మవారు కటాక్షించాలని కోరుకున్నానని చెప్పారు. అలాగే మండలంలోని అనేక గ్రామాల్లో వున్న అమ్మవారి ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బంగారమ్మపేట, గొడిచెర్ల, ఉపమాక, నక్కపల్లి, సీహెచ్‌ఎల్‌పురం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నేవీ ప్రహరీ గోడ నిర్మాణం ఆపాలని ఆందోళన



వై లోవ రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

రాంబిల్లి, ఆగస్టు 16: నేవీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు ఆపాలని డిమాండ్ చేస్తూ వై.లోవ గ్రామస్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రహరీ గోడ పనులను అడ్డుకోవడంతో పాటు రోడ్డుపై బైఠాయించారు. ప్రహరీ గోడ నిర్మిస్తే తామెలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. వరదలు వస్తే పాడి పశువులు ఎక్కడ మేపుకోవాలని, వేసవిలో ఉపాధి పనులు ఎలా చేసుకోవాలని ఉదయం నుంచి రోడ్డుపైనే బైఠాయించిన నిరసన తెలిపారు. విషయం తెలిగాయనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో ఆట్లాడారు. తహసీల్దార్‌తో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని గ్రామస్థులకు వారు సూచించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఈ సందర్భంగా గ్రామస్థులు వాపోయారు. వారి ఆందోళనకు సీపీఎం మండల కన్వీనర్ జి.దేవుడు నాయుడు మద్దతు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్ది నారాయణరావు, ప్రజా ప్రతినిధులు యన్నం రెడ్డి శ్రీనివాసరావు, బద్ది నారాయణరావు, గ్రామ పెద్దలు బద్ది నర్సింగ్, ఆనంద్, శ్రీను, కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు చేయూత

- మైక్రోస్మాల్ అండ్ మీడియం సంస్థ జేడీ శ్రీనివాస్



మాట్లాడుతున్న జేడీ శ్రీనివాస్

చోడవరం, ఆగస్టు 16: చిన్నతరహా పరిశ్రమలకు చెందిన స్వయం ఉపాధి యూనిట్లకు అవసరమైన సహ కారవందిస్తామని మైక్రోస్మాల్ అండ్ మీడియం సంస్థ జాయింట్ డైరెక్టర్ ఎ. శ్రీనివాస్ తెలిపారు. స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘ భవనంలో దివ్యాంగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతుతున్న వివిధ పథకాలను చిన్నతరహా పరిశ్రమల యజమానులు ఉపయోగించుకోవాలన్నారు. ఇందుకోసం అవగాహనకు శిక్షణ ను కల్పిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దుగ్గిరాల రవికుమార్, ఆర్కే ప్రసాద్, ముక్కా రమేష్, పట్నాయక్, రిటైర్డ్ లెక్చరర్ ఎన్. దేముడు తదితరులు పాల్గొన్నారు.

నిధుల పెంపును జీర్ణించుకోలేక వైసీపీ విమర్శలు

- ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ఎరుకునాయుడు



జీవో కాపీ చూపిస్తున్న ఎరుకునాయుడు

కె.కోటపాడు, ఆగస్టు 16: గ్రామ పంచాయతీలకు స్వాతంత్ర్య దినోత్సవానికి వెచ్చించే నిధులను కూటమి ప్రభుత్వం భారీగా పెంచిన విషయాన్ని వైసీపీ జీర్ణించుకోలేకే అసత్య ప్రచారం సాగిస్తోందని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత 34 ఏళ్లుగా స్వాతంత్ర్య వేడుకల్లో మేజర్ పంచాయతీలకు కేవలం రూ. 250లు, మైనర్ పంచాయతీలకు రూ. 100 మాత్రమే ఖర్చు చేసుకునే అవకాశం ఉండేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పెద్ద పంచాయతీకి రూ. 25వేలు, చిన్న పంచాయతీకి రూ.10వేల చొప్పున వ్యయం చేసుకునేలా ఇటీవల జీవో జారీ చేశారన్నారు. దీనిని సహించలేక వైసీపీ అక్కసు వెల్లగక్కుతుందన్నారు. గతంలో జగన్ ప్రభుత్వ హయాంలో పంచాయతీలను చీకట్లో నెట్టివేశారని, బ్లీచింగ్‌కు కూడా నయా పైసా ఖర్చు చేయలేని పరిస్థితి కల్పించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, ఆగస్టు 16 : మండల కేంద్రం పరవాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రావాడ, పరవాడ, భరిణికం, తానాం, ఈదుల పాక బోనంగి, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, జాజుల వానిపాలెం, పి.బోనంగి, కలపాక, వెన్నెలపాలెం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని వివరించారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

వరాల తల్లికి నీరా'జనం'

▸▸ ఇంటింటా అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మీ వ్రతం ▸▸ భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల ఆలయాలు




అనకాపల్లిలో విశేష అలంకరణలో కన్యకాపరమేశ్వరి, సత్యనారాయణపురంలోని కనకదుర్గమ్మ అమ్మవార్లు



పాయకరావుపేట చిట్టూరి మెట్రోలో వరమహాలక్ష్మి



సబ్బవరం : దేవీపురంలోని యంత్ర మహామేరులో అమ్మవారికి పూజలు



గవరపాలెంలో ధనలక్ష్మి అలంకరణలో సంతోషిమాత అమ్మవారు



నూకాంబిక ఆలయంలో మహిళల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



నక్కపల్లి : ఉపమాకలో గోదాదేవి తిరువీధి సేవ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16 : శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఇంటింటా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనకాపల్లి నూకాంబిక ఆలయంలోని బాలాలయంలో విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. గవరపాలెంలో సంతోషీమాత అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ మోక్షలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయం, గవరపాలెం పంచాయతన ఆలయం, కామాక్షిదేవి ఆలయం, కోటవీధిలోని సర్వకామదాంబ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు.

కొత్తూరు : అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలోని కొండపై కొలువుదీరిన కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక కోటి కుంకుమార్చన జరిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

పాయకరావుపేట : వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. పాండురంగస్వామి ఆలయంలో గోదాదేవికి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయం, దుర్గానగర్‌లోని దుర్గాలయం, రాజుగారిబీడులోని వెంకటేశ్వరాలయం, లక్ష్మీగణపతి ఆలయంతో పాటు మరిన్ని అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరపగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఇక్కడి జాతీయ రహదారిని అనుకుని ఉన్న చిట్టూరి మెట్రో ఆవరణలో గల వరమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు.

సబ్బవరం : మండలంలోని గ్రామ గ్రామాన వరలక్ష్మీ వ్రతాన్ని అంత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దేవీపురంలోని శ్రీయంత్ర మహామేరులో వరలక్ష్మీపూజ, అష్టోత్తర శత నామావళి సహిత కుంకుమార్చనలను గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు శ్రీవిద్యా ట్రస్టు సమకూర్చిన ప్రసాదాలతో పాటు గాజులు, పసుపు, కుంకుమలను అందజేశారు. అలాగే, సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో అమ్మవారికి బంగారం, వెండి పుష్పాలతో పూజలు జరిపారు.

ఉపమాకలో గోదాదేవి తిరువీధి సేవ

నక్కపల్లి : శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని ఉపమాక క్షేత్రంలో గోదాదేవి తిరువీధి సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి అర్చకులు సహస్ర కుంకుమార్చన జరిపారు. అనంతరం విశేష అలంకరణలో రాజాధిరాజ వాహనంలో అధిష్టించి మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా తమ ఇంటి మంగిటకు వచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఆగస్టు 16 : మండలంలోని గుర్రాజుపేట పరిధి యాతపేటలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీత కార్మికుల విభాగం రాష్ట్ర యాత కమిటీ డైరెక్టర్ గుత్తుర్తి పాండురంగ మాట్లాడుతూ లచ్చన్న ఆశయాలకు అనుగుణంగా అంతా ముందుకు సాగాలన్నారు. వచ్చే ఏడాది జయంతి నాటికి లచ్చన్న, మహాత్మా పూలే విగ్రహాలను ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు బీసీ విభాగ నాయకుడు, మాజీ సర్పంచ్ కురందాసు నూకరాజు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు గొంప బుజ్జి, మామిడి సత్తిబాబు, కొర్ని బంగారుకాసు, శ్రీను, శివకుమార్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు కంప్యూటర్లు వితరణ



కంప్యూటర్ సెక్షన్ ప్రారంభించిన సంస్థ ప్రతినిధులు

తుమ్మపాల, ఆగస్టు 16 : అనకాపల్లి గవరపాలెంలో గల మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలకు నల్లాం శ్రీరామ్ ఆర్గనైజేషన్ తరపున శుక్రవారం కంప్యూటర్లను వితరణగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కంప్యూటర్ రంగంలోనూ రాణించాలన్న సంకల్పంతో ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలకు సదరు సంస్థ కంప్యూటర్లను అందజేసింది. ఇందులో భాగంగా ఈ పాఠశాలకు మొదటి విడతగా ఆరు డెస్కటాప్ కంప్యూటర్లను ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లకు ఆర్గనైజేషన్ ప్రతినిధులు అందజేశారు. వీటిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర పట్నాయక్, గోవింద్, రామరాజు, ప్రియాంక, కమల, రత్నం, నాగమణి, మోతి, రేష్మ, సుభాషిని, కంప్యూటర్ ఫ్యాకల్టీ త్రినాథ్, రమణ, నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీకి వాటర్ డిస్పెన్సరీ అందజేత

సబ్బవరం, ఆగస్టు 16 : ఇక్కడి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులకు స్థానిక సూర్య మెడికల్స్ అధినేత బాదిరెడ్డి లక్ష్మణ శుక్రవారం వాటర్ డిస్పెన్సరీ (హాట్/కూల్ వాటర్)ని శుక్రవారం వితరణగా అందజేశారు. దీనిని సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ప్రారంభించారు. కేజీబీవీ ఎస్‌వో మృదుల, విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుడికి పూర్వ విద్యార్థులు బాసట

కశింకోట, ఆగస్టు 16 : అనారోగ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తోటి మిత్రుడికి తనతో చదువుకున్న వారు బాసటగా నిలిచారు. ఇక్కడి డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో కంచిపాటి సతీష్ 2001-2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివాడు. గత కొద్ది కాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేవన్న విషయాలను తెలుసుకున్న తనతోటి స్నేహితులు శుక్రవారం రూ.45వేల నగదును అందజేసి ఆదుకున్నారు. అన్నింటా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ప్రారంభం

పరవాడ (లంకెలపాలెం), ఆగస్టు 16 : సినీ హీరో చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ఆయన అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలిరోజు కార్యక్రమానికి జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై 5కె వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల రమణ చిరంజీవి అభిమానులకు టీషర్టులు, టోపీలను అందజేశారు. సంఘం ప్రతినిధులు మడక రమేష్‌నాయుడు, మాదాపు వాసుదేవరావు, గొల్లవిల్లి నాగరాజు, గంజి సురేష్, బంతికోరు గోవిందరాజు, శ్రీనివాసరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడు గణేశ్‌కు పురస్కారం

సబ్బవరం, ఆగస్టు 16 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ గణేష్ లెక్కలకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. జాతీయ సేవా సమితిలో ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు గురువారం ఏయూ ఉప కులపతి ప్రొఫెసర్ జి.శశిభూషణరావు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోండి

▸▸ రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ▸▸ విద్యార్థులకు దిశానిర్దేశం



కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, ఆగస్టు 16 : రేబాకలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహణ, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రధాన ఆచార్యులు ఐవీఎస్‌వీ శ్రీనివాసులు ఆమెకు వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఐఓటీ ప్రయోగశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

పాయకరావుపేట, ఆగస్టు 16 : ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో ఉన్న 40 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఈనెల ఒకటో తేదీన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఓటర్ల జాబితాలను కూడా ప్రదర్శనగా ఉంచారు. తొలుత ఈనెల ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాయిదా వేశారు. అనంతరం ఈనెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఎంఈవో కేవీఎన్ గాంధీ మాట్లాడుతూ శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. రెండు గంటలకు ఫలితాలు వెల్లడించడంతో పాటు నూతన ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

ఫ్లైయాష్ లారీలతో జనానికి అవస్థలు



ఫ్లైయాష్ లారీల రాకపోకల కారణంగా రాంకీ కమర్షియల్ హబ్ సమీపంలో రహదారిపై ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి

పరవాడ, ఆగస్టు 16 : సింహాద్రి ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్ లోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీల కారణంగా లంకెలపాలెం, పరవాడ ప్రాంత ప్రజలు దుమ్ము, ధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు వాపోయారు. తక్షణమే సంబంధిత లారీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీకి వెళ్లే ప్రధాన రహదారిలోని ఏలేరు కాలువకు ఆనుకుని ఉన్న సెజ్ జంక్షన్ నుంచి అనకపల్లి వరకు రహదారి ఫ్లైయాష్ లారీల రాకపోకలతో పూర్తిగా కాలుష్యం వెదజల్లుతోందన్నారు. దీనివల్ల ఆటుగా రాకపోకలు సాగించే వాహనదారులు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారనాన్రు.చాలా మంది శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఫ్లైయాష్ లోడుతో రాకపోకలు సాగిస్తున్న లారీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మాజీ ప్రధాని వాజపేయికు నివాళి



వాజపేయి విగ్రహం వద్ద నాయకుల నివాళి

కొత్తూరు, ఆగస్టు 16 : మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని అనకాపల్లి పట్టణంలోని రింగు రోడ్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, కొండబాబు, కర్రి రామకృష్ణ, ఉడా రమేష్, శేషగిరిరావు, వెంకట్రావు, మారిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలపాలెంలో పది రోజులుగా నీటి కష్టాలు



గ్రామంలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంకు



పైపులు పగిలిపోయిన ప్రదేశంలో పారుతున్న వరహా నది

కోటవురట్ల, ఆగస్టు 16 : మండల కేంద్రం కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో గత పది రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో అక్కడి వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోటవురట్ల శివారు గవరపేటలో వరహా నది ఒడ్డున భారీ రక్షిత మంచినీటి పథకాన్ని గతంలో నిర్మించారు. ఇక్కడి నుంచి గవరపేట, కోటవురట్ల పంట పొలాలు మీదగా రాట్నాలపాలెం శ్మశానవాటిక వద్ద గల గట్టునుంచి సదరు గ్రామానికి తాగునీటి పైపులైన్ వేశారు. ఇదిలా వుంటే, శ్మశానవాటికకు సమీపంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడి నుంచి టైరుబండ్ల ద్వారా రవాణా చేస్తుంటారు. అడపాదడపా రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా కూడా ఇసుక అక్రమ రవాణా జరుతుంటుంది. ఈ నేపథ్యంలో పైపులు పగిలిపోవడంతో సమస్య తలెత్తింది. పంచాయతీ సిబ్బంది సమస్యను గుర్తించే సరికి ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరహా నదిలో భారీగా నీరు చేరింది. దీంతో నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం పైపులు పగిలిపోయిన ప్రాంతంలో నాలుగు అడుగుల మేర నీరు పారుతుంది. ఈ పరిస్థితుల్లో పైపుల మరమ్మతుకు అవకాశం లేకపోతోంది. సమస్య ఏర్పడిన వెంటనే అధికారులు స్పందించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇసుక తవ్వకాల వల్లే పైపులు తరచూ పగిలిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గానీ, పంచాయతీ అధికారులుగానీ చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాట్నాలపాలెం గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేక చాలామంది సుదూర ప్రాంతాలకు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీంతాజలిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈ సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు.

సీహెచ్‌సీ సిబ్బందికి మరీ ఇంత నిర్లక్ష్యమా..!



నిరుపయోగంగా వదిలేసిన చేతులు కడిగే పరికరం

ఎలమంచిలి, ఆగస్టు 16 : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పాత భవనంలో చేతులు కడుక్కునే యంత్రంపై అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండడాన్ని చూసిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తులసీనగర్ ప్రాంతంలో ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణం చేపట్టడంతో ఇటీవల పాత ఆస్పత్రి భవనంలోని సామగ్రిని కొత్త భవనంలోకి మార్పు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా చేతులు శుభ్రం చేసుకునే రెండు యంత్రాలను మాత్రం పాత భవనంలోనే నిరుపయోగంగా వదిలేశారు. ఇది చూసిన పలువురు మండిపడుతున్నారు.

క్వారీలపై కన్ను!

... 3వ పేజీ తరువాయి

వైసీపీ మంత్రి ముఖ్య అనుచరుడు తెరిపించాడు. మంత్రి అనుచరుడు కొత్తగా మరో మైనింగ్ కంపెనీ పేరును రిజిస్ట్రేషన్ చేయించి అడ్డగోలుగా కొండలను తవ్వేసి సొమ్ము చేసుకున్నాడు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు ఈ క్వారీలను నిర్వహించేవాడు.

మళ్లీ మొదలైన ప్రయత్నాలు

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో జరిమానా చెల్లించని క్వారీల నిర్వాహకులు కూటమి నాయకులను ఆశ్రయించారు. జరిమానా మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించేలా ప్రయత్నాలు జరుగుతాయని అంతా భావించారు. కానీ పరిస్థితి భిన్నంగా ఉంది. గతంలో స్థానికులతో కలిసి వైసీపీ నాయకులు క్వారీల నిర్వహణపై ఆధిపత్యం ఎలా చెలాయించారో.. అదేవిధంగా కొందరు కూటమి నాయకులు కూడా నల్లరాయి క్వారీల నిర్వాహకులతో బేరసారాలకు దిగినట్టు ప్రచారం జరుగుతోంది. కుంచంగి, మార్టూరు, మామిడిపాలెం పరిసరాల్లో గతంలో మూతపడిన 18 క్వారీలను తెరిపించి కొండలను కొల్లగొట్టేందుకు చాపకింద నీరులా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

గతంలో వైసీపీ తరుపున క్వారీలను నడిపిన మాఫియాతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని గ్రామాల్లో మూతపడిన క్వారీల వివరాలను ఇప్పటికే సేకరించినట్టు సమాచారం. కుంచంగి, రొంగలివానిపాలెంలలో సర్వే నంబర్లు 269, 281లలో మూతపడిన క్వారీలను మళ్లీ తెరిపించేందుకు గ్రామస్థులతో మైనింగ్ మాఫియా బేరసారాలు సాగిస్తున్నది. మార్టూరు, మామిడిపాలెం, మాకవరంలలో గ్రామస్థులతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. దీనికి కూటమికి చెందిన కొందరు నేతలు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నట్టు తెలుస్తోంది.

విద్యార్థుల అగచాట్లు

... 3వ పేజీ తరువాయి

రూ.90,306 చొప్పున సంవత్సరానికి రూ.10,83,673లు అద్దె చెల్లిస్తున్నారు.

అద్దె భవనంలో ఇవీ సమస్యలు..

అద్దె భవనంలో వసతి సరిపోకపోవడంతో అడ్మిషన్లు పెరగడం లేదు. సరిపడినన్ని తరగతి గదులుంటే ఇప్పుడున్న 280 అడ్మిషన్లు ఆరు వందలకు పెంచుకోవడానికి అవకాశం ఉండేది. డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు భోజనాలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. క్రీడామైదానం లేక కిలోమీటరు దూరంలోఉన్న ప్రైవేటు స్థలం వద్ద కు పిల్లలను తీసుకు వెళ్లి ఆటలు, డ్రిల్ నిర్వహించాల్సి వస్తు న్నది. క్రీడలలో బీసీ విద్యార్థులు రాణిస్తున్నప్పటికీ వారికి సరైన సౌకర్యాలు లేవు. గదులు లేక గ్రంథాలయం, కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులకు విద్యార్థులు దూరమవుతున్నారు. ప్రైవేటు భవనంలో 16 మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో సరిపోవడం లేదు. మరో 15 మరుగుదొడ్లు ఉంటేగాని అన్ని అవసరాలకు సరిపోవని అంటున్నారు. బీసీ గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించి సొంతభవనం నిర్మిస్తే విద్యార్థులకు మరింత మేలు చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

ఆశలన్నీ అయ్యన్న మీదే..

బీసీ గురుకుల పాఠశాలకు పది ఎకరాలు స్థలం అవసరం ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యను పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. నర్సీపట్నంలో ప్రైవేటు భవనంలో తరగతులు మొదలు పెట్టి మూడేళ్లు అయినా పక్కా భవనం నిర్మాణానికి స్థలం పరిశీలించిన పాపాన పోలేదు. తాజాగా సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి బీసీ గురుకుల సమస్యను అధికారులు తీసుకు వెళ్లారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చే అయ్యన్నపాత్రుడు తప్పనిసరిగా సమస్య పరిష్కరిస్తారని బీసీ గురుకుల విద్యార్థులు ఆశ పడుతున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు



ఎన్నిక నిర్వహించనున్న చీడిగుమ్మల హైస్కూల్

గొలుగొండ, ఆగస్టు 16 : ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని ఎనిమిది హైస్కూళ్లు, కస్తూర్బా గాంధీ పాఠశాల, గురుకుల కళాశాలతో పాటు రెండు ప్రాథమికోన్నత, 48 ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. ఆయా పాఠశాలల్లో 4,269 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు జరగనున్నాయి. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగిలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

కౌలు రైతులుగా 240 మంది పేర్ల నమోదు

మాకవరపాలెం, ఆగస్టు 16 : మండలంలో కౌలు రైతులుగా 240 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని మండల వ్యవసాయాధికారి చిరంజీవి శుక్రవారం తెలిపారు. గ్రామ సభలు నిర్వహించగా, పలువురు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వీరి గుర్తింపునకు మరో వారం రోజులు సమయం ఉందని వివరించారు. అలాగే, సోమవారం నుంచి గ్రామాల్లో ఈ-క్రాప్ నిర్వస్తున్నట్టు చెప్పారు. ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నిత్యావసరాలు, దుస్తున్న అందిస్తున్న దృశ్యం

నాతవరం, ఆగస్టు 16 : డి.యర్రవరం పంచాయతీ డొంకాడ అగ్రహారం గ్రామంలో శుక్రవారం అగ్ని ప్రమాద బాధితులకు నాసా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెంది బొర్రా చిన్నారి, బంగారు దావీదు తదితరుల ఇళ్లు కాలిపోవడంతో వీటిని అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో సామర్ల అప్పారావు తాటిపాక శ్రీను, బంగారు సూరిబాబు, కొంగ్రు అప్పారావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అయ్యన్న దృష్టి

- నర్సీపట్నంలో అసంపూర్తిగా నిలిచిన పనుల పూర్తికి స్పీకర్ సన్నాహాలు
- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరంభించిన వాటిపై వైసీపీ నిర్లక్ష్యం
- ప్రస్తుతం వాటిని పూర్తి చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం
- అంచనాలు తయారు చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఫినిషింగ్ దశలో నిలిచిపోయిన పీఆర్ అతిథి గృహం

నర్సీపట్నం, ఆగస్టు 16 : పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనుల్లో కదలిక తీసుకు వచ్చేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి సారించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ఆరంభించి, వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనుల జాబితాను సేకరించారు. వాటి పూర్తికి అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి అంచనాలు తయారు చేయిస్తున్నారు. ముందుగా అన్నక్యాంటీన్ భవనానికి రూ.తొమ్మిది లక్షలతో మరమ్మతులు చేయించి. ప్రారంభానికి సిద్ధం చేశారు. ఈ భవనం ఇటీవల ప్రారంభం కావాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. అలాగే, గత టీడీపీ ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు అయ్యన్నపాత్రుడు ప్రతిష్టాత్మంగా తీసుకొని రూ.5.7 కోట్లతో నర్సీపట్నంలో పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను ఆరంభించారు. చాలావరకు పనులు కూడా జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ హయాంలో ఆ పనులు ఒక్క అంగుళం కూడా కదలలేదు. తాజాగా పనులు మొదలు పెట్టడానికి అంచనాలు తయారు చేయాలని రోడ్లు భవనాలు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన ట్యాంక్ బండ్ పనులకు రూ.మూడు కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

మోగనున్న బాజా భజంత్రీలు..



సత్యనారాయణస్వామి ఆలయం వద్ద అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం

ఇదిలావుంటే, బలిఘట్టం సత్యనారాయణ స్వామి గుడి సమీపంలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం పనులు మొదలు పెట్టడానికి పంచాయతీ అధికారులు రూ.1.25 కోట్లతో అంచనాలు తయారు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.75 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణం పనులు మొదలు పెట్టి రూఫ్ లెవల్ వరకు పూర్తి చేశారు. మొత్తం నిధులు ఖర్చు అయిపోవడంతో పనులు ఆగి పోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయలేదు. ఇప్పుడు సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ అధికారులు అంచనాలను తయారు చేశారు. కల్యాణ మండపం పైకప్పు, రెండు గదులు, మరుగుదొడ్లు, ఏసీ, ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ వర్క్, సీలింగ్



ఏరియా ఆస్పత్రి వద్ద ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా తీర్చిదిద్దిన అన్న క్యాంటీన్ భవనం

పనులకు రూ.1.25 కోట్లు అవుతాయని అధికారులు అంచనా వేశారు.

త్వరలో అతిథి గృహానికి హంగులు

నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గత టీడీపీ ప్రభుత్వంలో రూ.రెండు కోట్ల అంచనాతో పంచాయతీరాజ్ అతిథి గృహం పనులకు శ్రీకారం చుట్టారు. భవనం పనులు పూర్తి అయిపోయి ఫినిషింగ్ వర్క్ మిగిలి పోయింది. కాంట్రాక్టర్‌కు రూ.40లక్షలు బిల్లు బకాయి ఉండిపోయింది. వైసీపీ ప్రభుత్వంలో అటు వైపు కన్నెత్తి చూడక పోవడంతో అతిథి గృహం నిరుపయోగంగా ఉండి పోయింది. కాంట్రాక్టర్‌కు బకాయి బిల్లులు చెల్లించలేదు. ఇప్పుడు స్పీకర్ అదేశాలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు అంచనాలు తయారు చేశారు. ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, తపులు, కిటికీ రెక్కలు, ఫ్లోరింగ్ టైల్స్, నీటి సదుపాయం, రంగులు వేయించడానికి రూ.48 లక్షలు అవుతాయని అంచనాలు తయారు చేశారు. ఆయా శాఖ మంత్రులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి, పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్న సంకల్పంతో సభాపతి అయ్యన్న ఉన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల కోలాహలం



కృష్ణాదేవిపేట కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 16 : శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా గొలుగొండ మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు సందడిగా మారాయి. తొలుత ఇళ్లలో వ్రతాన్ని జరిపిన అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో కృష్ణాదేవిపేట, చోద్యం, పాత కృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం, కొంగశింగి, లింగంపేట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది.

పలు గ్రామాల్లో శిథిలావస్థలో దోబీఘాట్ భవనాలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 16 : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో దోబీఘాట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నారు. దీంతో రజకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏఎల్‌పురం, చీడిగుమ్మల, సీహెచ్.నాగాపురం, జోగంపేట, చోద్యం తదితర గ్రామాల్లో భవనాల దుస్థితి మరీ దారుణంగా ఉంది. ఇవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతోందని వారంతా వాపోతున్నారు. కృష్ణాదేవిపేట దోబీఘాట్ భవనం ఐదేళ్లుగా ఇదే దుస్థితిలో ఉంది. దీనిని 2000-2001లో అప్పటి చింతపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు హయాంలో నిర్మించారు. ప్రస్తుతం ఇది ప్రమాదకరంగా మారింది. ఈ భవనంలో గతంలో ఆయా గ్రామానికి చెందిన సుమారు 80 కుంటుబాల రజకులు బట్టలను భద్రపర్చుకునేందుకు ఉపయోగించే



కృష్ణాదేవిపేటలో శిథిలావస్థకు చేరిన భవనం

వారు. ప్రస్తుతం దీని పరిస్థితి చూసి అడుగు పెట్టాలంటేనే హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆయా భవనాలకు మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

క్వారీలపై కన్ను!

... 3వ పేజీ తరువాయి

వైసీపీ మంత్రి ముఖ్య అనుచరుడు తెరిపించాడు. మంత్రి అనుచరుడు కొత్తగా మరో మైనింగ్ కంపెనీ పేరును రిజిస్ట్రేషన్ చేయించి అడ్డగోలుగా కొండలను తవ్వేసి సొమ్ము చేసుకున్నాడు. ఇటీవల జరి గిన ఎన్నికలకు ముందు వరకు ఈ క్వారీలను నిర్వహించేవాడు.

మళ్లీ మొదలైన ప్రయత్నాలు

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో జరిమానా చెల్లించని క్వారీల నిర్వాహకులు కూటమి నాయకులను ఆశ్రయించారు. జరి మానా మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించేలా ప్రయత్నాలు జరుగుతాయని అంతా భావించారు. కానీ పరిస్థితి భిన్నంగా ఉంది. గతంలో స్థానికులతో కలిసి వైసీపీ నాయకులు క్వారీల నిర్వహణపై ఆధి పత్యం ఎలా చెలాయించారో.. అదేవిధంగా కొందరు కూటమి నాయకులు కూడా నల్లరాయి క్వారీల నిర్వాహకులతో బేరసారాలకు దిగి నట్టు ప్రచారం జరుగుతోంది. కుంచంగి, మార్టూరు, మామిడిపాలెం పరిసరాల్లో గతంలో మూతపడిన 18 క్వారీలను తెరిపించి కొండలను కొల్లగొట్టేందుకు చాపకింద నీరులా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గతంలో వైసీపీ తరుపున క్వారీలను నడిపిన మాఫియాతో లోపాయి కారి ఒప్పందాలు కుదుర్చుకొని గ్రామాల్లో మూతపడిన క్వారీల వివరాలను ఇప్పటికే సేకరించినట్టు సమాచారం. కుంచంగి, రొంగలివానిపాలెంలలో సర్వే నంబర్లు 269, 281లలో మూతపడిన క్వారీలను మళ్లీ తెరిపించేందుకు గ్రామస్థులతో మైనింగ్ మాఫియా బేరసారాలు సాగిస్తున్నది. మార్టూరు, మామిడిపాలెం, మాకవరంలలో గ్రామస్థులతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. దీనికి కూటమికి చెందిన కొందరు నేతలు సహాయ సహకారాలు అందజేస్తున్నట్టు తెలుస్తోంది.

విద్యార్థుల అగచాట్లు

... 3వ పేజీ తరువాయి

రూ.90,306 చొప్పున సంవత్సరానికి రూ.10,83,673 అద్దె చెల్లిస్తున్నారు.

అద్దె భవనంలో ఇవీ సమస్యలు..

అద్దె భవనంలో వసతి సరిపోకపోవడంతో అడ్మిషన్లు పెరగడం లేదు. సరిపడినన్ని తరగతి గదులుంటే ఇప్పుడున్న 280 అడ్మిషన్లు ఆరు వందలకు పెంచుకోవడానికి అవకాశం ఉండేది. డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు భోజనాలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. క్రీడా మైదానం లేకపోవడంతో కిలోమీటరు దూరంలో ఉన్న ప్రైవేటు స్థలం వద్దకు పిల్లలను తీసుకు వెళ్లి ఆటలు, డ్రిల్ నిర్వహించాల్సి వస్తున్నది. క్రీడలలో బీసీ విద్యార్థులు రాణిస్తున్నప్పటికీ వారికి సరైన సౌకర్యాలు లేవు. గదులు లేక గ్రంథాలయం, కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతులకు విద్యార్థులు దూరమవుతున్నారు. ప్రైవేటు భవనంలో 16 మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో సరిపోవడం లేదు. మరో 15 మరుగుదొడ్లు ఉంటే గాని అన్ని అవసరాలకు సరిపోవని విద్యార్థులు అంటున్నారు. బీసీ గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించి సొంత భవనం నిర్మిస్తే బీసీ విద్యార్థులకు మరింత మేలు చేకూరుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆశలన్నీ అయ్యన్న మీదే..

బీసీ గురుకుల పాఠశాలకు పది ఎకరాలు స్థలం అవసరం ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యను పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. నర్సీపట్నంలో ప్రైవేటు భవనంలో తరగతులు మొదలు పెట్టి మూడేళ్లు అయినా పక్కా భవనం నిర్మాణానికి స్థలం పరిశీలించిన పాపాన పోలేదు. తాజాగా సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి బీసీ గురుకుల సమస్యను అధికారులు తీసుకు వెళ్లారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చే అయ్యన్నపాత్రుడు తప్పనిసరిగా సమస్య పరిష్కరిస్తారని బీసీ గురుకుల విద్యార్థులు ఆశ పడుతున్నారు.

చోడవరం
నియోజకవర్గం

విద్యార్థులకు నగదు పురస్కారాలు



నగదు ప్రోత్సాహం అందిస్తున్న నవతరం యూత్ ప్రతినిధులు

రోలుగుంట, ఆగస్టు 16 : బుచ్చెంపేట జడ్పీ హైస్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామ నవతరం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందించారు. స్వాంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండలంలో టాపర్‌గా నిలిచిన కన్నూరు హరీష్‌కు రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన లీలావతికి రూ.1500, 500 మార్కులు దాటిన నలుగురు విద్యార్థులకు రూ.1000 చొప్పున బహుమతులను అందించారు. ఎంఈఓ జగ్గారావు కూడా ప్రోత్సాహంగా నగదు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉలబాల చంద్ర, వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కి సత్కారం

చీడికాడ, ఆగస్టు 16: గత పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అమలకంటి భానుసంపత్‌ను ఘనంగా సత్కరించారు. ఖండివరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన భాను సంపత్ 600 మార్కులకుగాను 576మార్కులు సాధించి మండలంలో మొదటిస్థానం సాధించారు. దీంతో స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా గురువారం ఆ పాఠశాలలో స్థానిక సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మండల పరిషత్ కోఆప్షన్ మెంబరు షేక్ సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, కురచా నారాయణమూర్తి తదితరుల చేతులమీదుగా ఓదాత అందించిన రూ.5వేలు నగదు, షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



గాంధీ గ్రామంలో రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న స్థానిక నేతలు

చోడవరం, ఆగస్టు 16: పట్టణ శివారు గాంధీగ్రామం పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో మరిడిమాంబ ఆలయానికి సీసీ రోడ్డు ని ర్మాణం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గాడి అప్పారావు, స్థానిక నాయకులు కోలా రమణ, లక్ష్మణరావు, మల్ల కళ్యాణ్‌కుమార్, కోయిలాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

'పీఏసీఎస్‌ల్లో సభ్యులు వివరాలందించాలి'

మాడుగుల రూరల్, ఆగస్టు 16 : పీఏసీఎస్‌ల్లో లావాదేవీలన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నందున సభ్య రైతులు వివరాలు ఇచ్చి సహకరించాలని ఎం.కోడూరు సొసైటీ ఇన్‌చార్జి ప్రసాద్ కుమార్, సీఈవో బంటు రామునాయుడు ఒక ప్రకటనలో కోరారు. రైతులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, నామి, భూమి పాసుపుస్తకం, వన్ బి కాపీలతో పాటు, పాస్ ఫొటో, ఫోన్ నంబర్ వివరాలివ్వాలన్నారు.

కుక్కల స్వైర విహారంతో బెంబేలెత్తుతున్న జనాలు

- గ్రామాల్లో సమస్య తీవ్రతరం .. నిరోధక చర్యలు శూన్యం

మాడుగుల రూరల్, ఆగస్టు 16 : మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా రోడ్లు, వీధుల్లో తిష్ఠ వేస్తున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెంటబడి పరుగులు తీయిస్తున్నాయి. దీంతో భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల నియంత్రపై పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో జిల్లాల్లో కుక్కల దాడిలో చిన్నారులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గుంపులుగా ఉన్న కుక్కలను చూసి ఆ వైపుగా వెళ్లేందుకు భయపడుతున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో పగలు రాత్రి తేడాలేకుంగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇక్కడ మాంసం దుకాణాలు, హోటళ్లు ఎక్కువగా ఉండడంతో పారేసిన వ్యర్థాల కోసం కుక్కలు కొట్లాడుకుంటున్నాయి. వీధుల్లో కూడా కుక్కలు సంచరిస్తుండడంతో పాదచారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు కుక్కల నిరోధించాలని కోరుతున్నారు.



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో రోడ్లపై కుక్కల గుంపులు

విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ జరిపించాలి

- ఉప ముఖ్యమంత్రి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు

రోలుగుంట, ఆగస్టు 16 : విశాఖ డెయిరీలో చోటుచేసుకున్న అక్రమాలపై జ్యూడీషియల్ విచారణ జరిపించాలని కోరుతూ మండలంలోని కొవ్వూరుకు చెందిన సామాజిక కార్యకర్త, మండల ఐ టీడీపీ ఇన్‌చార్జి బంటు రాజు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను కలిసి ఫిర్యాదుచేశారు. అవినీతికి నిలయంగా విశాఖ డెయిరీ మారిందని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో సుమారు 4 లక్షల మందికి పైగా ఉన్న పాల ఉత్పత్తిదారులు నష్ట పోయే విధానంగా నిర్ణయాలు సాగుతున్నాయన్నారు. గ్రామాల్లో ట్రస్ట్ నుంచి కేవలం ఒక్కో మండపానికి రూ. 3- 5 లక్షలు కేటాయించి, మిగతా సొమ్ము పాల కేంద్రాల నుంచి డ్రా చేసి, సుమారు రూ. 40 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారన్నారు. రైతు సేవ పేరుతో ట్రస్ట్ ద్వారా కిమ్స్ ఆసుపత్రికి నెలకు రూ. కోటి చైర్మన్ సమీప బంధువులకు ధారాదత్తం చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ట్రస్ట్ ద్వా రా రూ. 25 కోట్లు మరో సంస్థకి కేటాయించినట్లు ఆరోపించారు. ఆరోగ్య బీమా పేరుతో రైతుల నుంచి ఏడాదికి సుమారు రూ. 20 కోట్లు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున డెయిరీ చైర్మన్ ఆనంద్ పోటీ చేసి డెయిరీ నిధులు వాడుకున్నారని ఆరోపించారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రమిస్తున్న బంటు రాజు

'మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి'



వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న దృశ్యం

చోడవరం, ఆగస్టు 16: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో మహిళా వైద్యులు, నర్సుల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్త్రీ విముక్తి సంఘటన్ జిల్లా కన్వీనర్ ఒ. లక్ష్మీకుమారి డిమాండ్ చేశారు. కోల్‌కతాలో ఘటనను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం స్త్రీ విముక్తి సంఘటన్, ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న మహిళా డాక్టర్లు, నర్సుల భద్రత విషయంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు నందారపు భాస్కర్, కల్పన కుమారి, రాంచరణ్, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

మాడుగుల రూరల్, ఆగస్టు 16: కేజేపురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు ఆధ్వర్యంలో శ్రావణమాసం రెండో శు క్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిం చారు. ఈ జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అమ్మతల్లినాయుడు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

మాడుగుల: ఇళ్లలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రంవెంకటేశ్వరస్వామి, సంతోషిమాత, మోదమాంబ ఆలయాలను ర్శించుకున్నారు.

కె.కోటపాడు: స్థానిక శ్రీ భీమలింగేశ్వర ఆలయంలోని శ్రీ లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



కేజే పురం జంక్షన్‌వద్ద ఆలయంలో నిర్వహించిన వ్రతాల్లో మహిళలు

సమస్యల పరిష్కారమే జనసేన లక్ష్యం

- చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

రావికమతం, ఆగస్టు16: ప్రజా సమస్యల లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు జనసేన నియోజకవర్గ ఇంచార్జి పీవీ ఎస్ ఎన్ రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆయన స్వగ్రామమైన కొత్తకోటలో జనసేన లక్ష్యం. ప్రజాక్షేమం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్యలతో పాటు, డ్రైనేజీల నిర్వహణ సరిగా లేక పడుతున్నట్టు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని రాజు విజ్ఞప్తి చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంపై తెలుసుకునేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పర్యటించనున్నట్టు ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసైరి చిన్నబ్బాయ్, చింతల కిషోర్, లొట్ల శివ, కోన రమణ, శీలం గౌతమ్, రాజా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు బీమా అందజేత

రోలుగుంట: మండలంలోని అంట్లపాలెంనకు చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు గుమ్మిడి గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆతని కుడికాలి శస్త్ర చికిత్స జరిగింది.



కొత్తకోటలో సమస్యలు తెలుసుకుంటున్న రాజు

ఈ నేపథ్యంలో శుక్రవారం రూ.29,846 పరిహార చెక్కును నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు చేతుల మీదుగా అతనికి అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, పరవాడ దొరబాబు నందారపు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

నేత్ర వైద్య చికిత్సకు 38 మంది ఎంపిక

మాడుగుల రూరల్, ఆగస్టు 16 : మండలంలోని కేజేపురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపకులు రాపేటి రామకొండారావు ఆధ్వర్యంలో సంగివలస అనీల్‌నీరుకొండ ఆస్పత్రి సహకారంతో ఇటీవల ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ఎంపిక చేసిన 38 మందిని శ స్త్రచికిత్సలకు ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులో తరలించారు.

పూర్వ విద్యార్థుల వితరణ




మైక్ సెట్ వితరణగా ఇస్తున్న పూర్వ విద్యార్థులు

మాడుగుల రూరల్, ఆగస్టు 16 : మండలంలోని ఎం.కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2015-16 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ. 25 వేలతో పాఠశాలకు మైకొసెట్, 20 ప్లాస్టిక్ కుర్చీలు అందజేశారు. అలాగే, 2017-18 బ్యాచ్ పూర్వ విద్యార్థి యర్రంశెట్టి మోహన్ గత ఏడాది ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికి రూ. 10వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి గత పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికి రూ. 4500 చొప్పున బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మిండి కొండాజీ, యర్రంశెట్టి మోహన్, కోట్ని మధు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి: ఏడీఏ

దేవరాపల్లి, ఆగస్టు 16: పంట నమోదుతో సంక్షేమ పథకాలు అమలుకానున్నాయని అదనపు వ్యవసాయ అధికారి వి.రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని కాశీపురంలో పంటలను పరిశీలించి రైతులకు పంటల నమోదుపై అవగాహన కలిగించారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న కారణంగా ప్రతి ఒక్కరూ పంట నమోదు చేసు కోవాలని పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ప్రభుత్వం ప్రకటించిన నిర్దిష్ట ధరకు ధాన్యం కొనుగోలు చేసుకోవచ్చు. పంటల బీమాకు పంట నమోదు చేసుకున్న రైతులు అర్హులు, కౌలు రైతుకూడా అర్హుడే అన్నారు. డి.పట్టా దారుడు గ్రామ రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవచ్చన్నారు. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి వాజ్‌పేయి విశేష కృషి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కె.కోటపాడు, ఆగస్టు 16 : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఆరవ వర్ధంతి కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాజపేయి హయాంలో ప్రజల మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి ఎంతో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇమంది సన్యాసిరావు, శరగడం సన్యాసినాయుడు, జానపరెడ్డి సూ ర్యనారాయణ, బొడ్డు శ్రీరామమూర్తి, ఎస్. వెంకటలక్ష్మి, ఆర్. సంతోషి తదితరులు పాల్గొన్నారు.